# తీయని మాటల ముసుగులలో

రెవిన్యూ ఆఫీసర్ పోస్టుకి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోసం పడ్డ ప్రకటనని చూసి, దానికి అప్లయి చేశాడు జంబులింగం. ఆ పోస్టుకి కావలసిన అర్హతలన్నీ తనకున్నా, ఏమో ఈ రోజుల్లో ఏ రికమెండేషనూ లేకుండా పన్లు అవుతాయో కావో నన్న దిగులుతో, ఆ డిపార్టుమెంటులో అధికారుల జాబితానీ, ఆరోజు ఇంటర్‌వ్యూ బోర్డులో ఎవరెవరుంటారో ఆ మెంబర్ల పేర్లనీ అన్నీ తెలుసుకుని వాళ్ళలో ఎవరు ఎవరికి పరిచయమా, అని లెక్క వేసుకుని అందరిలోకీ ఇంచుమించు అందరితోటీ పరిచయాలున్న పలుకుబడిగల పెద్దమనిషి, రామశాస్త్రిని పట్టుకున్నాడు.

జంబులింగం చెప్పిందంతా విన్న రామశాస్త్రిగారు, "జంబులింగంగారు! ఇటు వంటి పోస్టులకి రికమెండేషన్లు ఎలా ఉండాలయ్యా అంటే, అలాంటివాళ్ళు చెబితే లాభం వుండదు! ఒక్కొక్క ఆఫీసరుకి ఒక వందైనా ఒస్తాయి రికమండేషన్లు, అవునా?"

"అవునండి" నమ్రతగా తలూపుతూ చెప్పాడు జంబులింగం.

"ఇక మంత్రిగారు! వారికి కనీసం ఒక పాతికైనా వస్తాయంటారా?"

"అవునండి. తప్పకుండా వస్తాయి"

"ఆ పాతికలో మనం ఎక్కడుంటాయో, మనది ఎన్నో నెంబరో మనకేం తెలుసు?"

"మరేం చెయ్యాలి సార్?"

"ముఖ్యమంత్రిగారు మిగిలారు. వారికీ కనీసం ఒక నాలుగో అయిదో ఒస్తాయి కదా రికమెండేషన్లు. ఎందుకంటే స్థాయి హెచ్చిన కొద్దీ చెప్పేవారి సంఖ్య చాలా తగ్గుతుంది. వారిని కలుసుకునే తాహతూ, అవకాశమూ ఉండాలిగా! ముఖ్యమంత్రిగారితో మాట్లాడే తాహతు నలుగురయిదుగురు కంటే వుండదు!

అటువంటప్పుడు ఆ నలుగురయిదుగురిలో ఎవరు ముందుగానో, గట్టిగానో, చెప్పగలుగుతారో వాళ్ళు అదృష్టవంతులు. ఏమంటారు?" ముక్కుపొడుం పీలుస్తూ లాల్చీమీది కండువా సవరించుకున్నారు రామశాస్త్రిగారు ఓరకంటితో జంబులింగాన్ని చూస్తూ.

"మహాప్రభో! ముఖ్యమంత్రిగారికి చెప్పగల తాహతూ, సాహసం మీకొక్కరికే వున్నాయి! కాదనకండి! చెప్పండి! ఎప్పుడు వెళదామో?" వెంటనే పోదామన్నా 'రెడీ' అన్నట్లు చేతులు కట్టుకుని నుంచున్నాడు జంబులింగం!

ఒక్క నిమిషం ఆలోచించాడు రామశాస్త్రిగారు.

"చూడండీ! రేప్పొద్దుట ఆరింటికల్లా మీరు టాక్సీ తీసుకుని మా ఇంటికి రండి. నేను రెడీగా ఉంటాను. మనం ముఖ్యమంత్రిగారింటికి వెళ్ళి వారి దర్శనం చేసుకుందాం! ఏమంటారు?" అలాగేనండి అంటూ ఎగిరి గంతేశాడు జంబులింగం.

తెల్లవారేటప్పటికి రెడీ అయిపోయి, టాక్సీ తీసుకుని, రామశాస్త్రిగారి ఇంటిముందు వాలాడు జంబులింగం. రామశాస్త్రిగారు రెడీగా నుంచున్నారు వసారాలో. జంబులింగాన్ని చూసి ఒక చిరునవ్వు విసిరి, గడియారం చూసుకుని "టైమంటే టైముకొచ్చేశావోయ్" అంటూ గట్టిగా ఒక్కసారి ముక్కు పొడుం పీల్చి టాక్సీ ఎక్కారు.

అప్పటికే జనం బాగా ఉన్నారు. సరాసరి వెళ్ళి పర్సనల్ స్టాపుతో ఏదో మాట్లాడారు రామశాస్త్రిగారు. "కాస్సేపు కూర్చోండి" అని లోపలికి వెళ్ళొచ్చాడు పి.ఎస్ (పర్సనల్ సెక్రటరీ). ఓ పదినిమిషాల్లో "రండి" అన్నాడు లోపలికి దారిచూపిస్తూ పి.ఎస్. జంబులింగం లేచి నుంచుని, కొత్త షర్టు కాలర్ నలిగినట్టనిపిస్తే సరిదిద్దుకుని లేచి నుంచున్నాడు, ముఖ్యమంత్రిగారితో ఎలా మాట్లాడాలో అంతా మనసులోనే వల్లించుకుంటూ. రామశాస్త్రిగారు కండువా సర్దుకుని "జంబులింగంగారూ! మీరు కూర్చోండి. మరీ మీ ఎదురుగ్గా మాట్లాడితే బాగుండదు. అన్ని విషయాలూ నేను చెప్తాను లెండి" అంటూ గబగబా పి.ఎస్ వెనకాలే వెళ్ళిపోయారు.

ఒక పావుగంట తరువాత తిరిగొచ్చారు రామశాస్త్రిగారూ, పి.ఎస్సూ కూడా!

"పదండి కార్లో చెప్తాను" అన్నారు రామశాస్త్రిగారు. జంబులింగం గారికి తను ముఖ్యమంత్రిగారిని కలువలేదన్న బాధ కలిగినా, పనైతే చాల్లేమని ఊరుకున్నారు.

"మీ సంగతంతా చెప్పేశాను. తప్పకుండా పనైపోతుంది" అన్నారు రామశాస్త్రిగారు నవ్వుతూ.

"థాంక్స్ సార్" అన్నాడు జంబులింగం. ఇంటర్వ్యూ రిజల్ట్స్ రాగానే స్వీటు పాకెట్‌తో సహా రామశాస్త్రిగారి దర్శనం చేసుకున్నాడు జంబులింగం.

ఏదో పనిమీద రెవిన్యూ ఆఫీసర్ జంబులింగం ముఖ్యమంత్రిగారిని కలుసుకోవడానికి వెళ్ళవలసి వచ్చింది. పి.ఎస్ జంబులింగంగారిని గుర్తుపట్టి పలకరించాడు. మాటల్లో "ఏమిటిసార్! మీరు రామశాస్త్రిగారిని మీ పోస్టు రికమెండేషన్ కోసం తెచ్చారు కదూ ఆరోజు" అడిగాడు పి.ఎస్.

"అవును! వారి దయవల్లే నాకీ సెలక్షన్ వచ్చింది" అన్నారు నమ్రతగా.

పకపకా నవ్వాడు పి.ఎస్.

అర్థంకాక అతనికేసి చూస్తున్న జంబులింగంగారిని చూసి "అయ్యా! అతను వాళ్ళ అబ్బాయి ట్రాన్స్‌ఫర్ గురించి ఏదో మాట్లాడి వెళ్ళిపోయారు. ఇంతకీ, ఇంటర్వ్యూలో ఏ రికమెండేషన్లూ పనిచెయ్యలేదు. మెరిట్ మీదే వెళ్ళారు కాబట్టి మీరు సెలక్ట్ అయ్యారు" అన్నాడు.

జంబులింగంగారి తలమీద పిడుగుపడ్డట్టయింది. 'మైగాడ్! ఆరోజు టాక్సీకి ఎనభై రూపాయలు, స్వీట్స్ నలభై అయిదు రూపాయలు మొత్తం నూటపాతిక!'

అది కేవలం రామశాస్త్రిగారి కొడుకు ట్రాన్స్‌ఫర్ కోసం, తను ఖర్చుపెట్టాడన్నమాట!

'ఇటువంటి వాళ్ళు ఉంటారా?' ఆశ్చర్యంలోంచి తేరుకునేలోగా "సార్! లోపలికెళ్ళండి" అంటూ జవాను తలుపుతెరిచాడు!

ఆలోచిస్తూనే లోపలికెళ్ళారు. తియ్యని మాటలతో చేదుపన్లు ఎంత చక్కగా చెయ్యొచ్చో రామశాస్త్రిగారి పాఠంవల్ల తెలుసుకున్న జంబులింగంగారు! ఇంకెప్పుడూ ఎవ్వర్నీ ఛస్తే నమ్మకూడదని నిశ్చయించుకుని, గబగబా నడిచాడు తృప్తిగా!

★